క్లుప్తంగా

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విసుగు



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

సిరిసిల్ల: పదకొండు నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, పాలమూరు రైతుల్లాగే, ప్రజలు ప్రభుత్వంపై తిరుగబడుతారని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాలన ఉందా..? లేదా అన్నట్లు తయారైందన్నారు. పాలమూరు రైతులు గతంలో వలసలు వెళ్లేవారని, కేసీఆర్ పాలనతో ఊర్లు పచ్చబడి వలసలు తగ్గాయన్నారు. మళ్లీ పాత రోజులు వచ్చే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తుందన్నారు. మూసీనది కలుషితం కావడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నారు. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు కత్తెర వరుణ్‌కుమార్, రాజు, మునీర్, మన్సూర్, ఇమ్రాన్, షకీల్, సోను తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సిరిసిల్ల: జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ శనివారం సన్మానించారు. సత్యనారాయణగౌడ్ గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల గ్రంథాలయంలో ఆయనను కలిసి సన్మానించారు. సీనియర్ న్యాయవాది కె.ధర్మేందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, పార్టీ నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, వివేక్. అనిల్, రాగుల కర్ణాకర్, అన్సర్ అలీ, కడగండ్ల తిరుపతి, రాజురి రమేశ్, జెట్టి శేఖర్, బొద్దుల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ అవర్‌ను వినియోగించుకోవాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

కోనరావుపేట: విద్యార్థుల కోసం పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక తరగతులను వినియోగించుకోవాలని జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం కొలనూర్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను శనివారం తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీపతి శ్రీనివాస్, కుసుమ కుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సాంకేతికపరంగా కొంతమంది రైతు రుణమాఫీని ప్రభుత్వం పరిశీలించి వారికి మాఫీ అయ్యేలా చూస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఐకేపీ, సింగిల్‌విండోల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు రాంరెడ్డి, లక్ష్మీ, బాలయ్య, రాజేందర్, గణపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్లక్రైం: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తితోపాటు వాటిని ప్రోత్సహిస్తున్న లక్ష్మీ ఇండస్ట్రీస్ యజమానిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన చిత్తారి రమేశ్, లక్ష్మీ ఇండస్ట్రీస్ యజమానిపై కేసు నమోదు చేశారు. చిత్తారి రమేశ్ కొద్ది రోజులుగా కోనరావుపేట చుట్టూ పక్కల గ్రామాల్లో రేషన్‌బియ్యం కొని, చంద్రంపేట శివారులోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌లో విక్రయిస్తున్నాడు. ఈ బియ్యాన్ని మిల్లు యజమాని పాలిష్ చేసి సన్న బియ్యంగా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఎప్పటిలాగానే శనివారం కోనరావుపేట మండలం నుంచి ఆటోలో రేషన్‌బియ్యం తీసుకొస్తుండగా సిరిసిల్ల పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి చేసి 8 క్వింటాళ్ల బియ్యంతోపాటు ఆటోను సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

గణపతి హోమం



ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజలను శనివారం ఘనంగా ప్రారంభించారు. రాజుగురుస్వామి ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. ధ్వజారోహణంతో అయ్యప్ప దీక్షలను స్వీకరించిన వారు మండల దీక్షలను చేపట్టారు. అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

‘బర్‌పూరీ’గా తిండాం

- సిరిసిల్లలో పూరీ సెంటర్లు ప్రత్యేకం
- వెరైటీ కర్రీస్‌తో కస్టమర్లను ఆకట్టుకుంటున్న నిర్వాహకులు
- తరాలుగా ఉపాధి పొందుతున్న వైనం

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: పట్టణవాసులు రోజూ ఉదయాన్నే అల్పాహారాన్ని బర్‌పూరీలాగా తింటున్నారు. వివిధ వృత్తులు, ఉద్యోగాలు, పనులకు వెళ్లేవారికి వెరైటీ కర్రీస్‌తో కస్టమర్లను పలు పూరీ సెంటర్లు ఆకట్టుకుంటున్నాయి. వీటిలో వెజిటేరియన్ కర్రీస్, నిమ్మకాయతో కలిపి ఇవ్వడం ప్రత్యేకత. పట్టణంలో కేవలం ఏకైక టిఫిన్ ద్వారా రెండు తరాల వారు ఉపాధిలో చిరు వ్యాపారుల సక్సెస్‌పై సండే స్పెషల్ కథనం..







1967లో ప్రారంభించాం



మా నాన్న బత్తుల నర్సయ్య సిరిసిల్ల దేశాయ్‌ల గడీ పక్కనే 1967లో హోటల్ ప్రారంభించారు. చిన్నప్పటి నుంచి ఇదే హోటల్ ద్వారా మాకుటుంబం ఉపాధి పొందుతోంది. 1990 నుంచి నేను హోటల్ నడిపిస్తున్నా. ఇప్పుడు నా భార్య హోటల్‌లో సహాయకురాలిగా ఉంటోంది. కేవలం పచ్చిపిండిని పొడి పిండితో లాటిస్తూ..పూరీలు చేస్తాం. దీంతో పూరీకి నూనె అంటుకోదు. ఆయిల్ తక్కువగా తినేవారు ఖచ్చితంగా మా హోటల్‌కే వస్తారు. 50 ఏళ్లుగా కేవలం పూరీ హోటల్ నడుపుతూ ఉపాధి పొందుతున్నాం. వారంలో మంగళ, శుక్రవారాల్లో ఉల్లిగడ్డల కర్రీ, మిగతా ఐదు రోజులు సొరకాయ పప్పు కర్రీస్ ప్రత్యేకత. ఉదయం 10 గంటలకు రెండో కర్రీగా బేసిన్ (పిట్ల)ను అందిస్తాం. మా హోటల్‌కు వచ్చే వారిని మర్యాదగా సేవలు అందిస్తాం.

– బత్తుల రమేశ్ -జ్యోతి విలాస్ యజమాని, పెద్దబజార్

ఆరేళ్లుగా హోటల్ నడుపుతున్నాం



నేను 30 ఏళ్ల క్రితం సిరిసిల్లలో దాసు హోటల్‌లో పనిచేశా. ఇప్పుడు ఆరేళ్లుగా మార్కెట్ ఏరియాలో సొంతంగా హోటల్ నడపుతున్నా. అప్పట్లో దాసు హోటల్ అంటేనే సిరిసిల్లలో చాలా ఫేమస్. అందుకే ఇప్పుడు నేను నడిపిస్తున్న హోటల్‌లో అదే రీతిలో పూరీలు అందించడంతో కస్టమర్లు ఆదరిస్తున్నారు. ఆదివారం(ఆలుకుర్మా), సోమవారం (పెసరపప్పు ఉల్లిగడ్డ), మంగళవారం (శనగపప్పు ఉల్లిగడ్డ), బుధవారం (ఆలు ఉల్లిగడ్డ), గురువారం (కందిపప్పు ఉల్లిగడ్డ), శుక్రవారం (శనగపప్పు), శనివారం (మైసూరుపప్పు సొరకాయ) కర్రీస్ అందిస్తున్నాం. కస్టమర్లకు వేడి వేడి పూరీలతోపాటు కావాల్సినంత కర్రీ, నిమ్మకాయ, చల్లను ఇస్తాం. రోజూ ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే కస్టమర్లకు అందించే హోటల్. పార్శిల్ గిరాకీ ఉంది.

– ఎనగంటి జగదీశ్-కవిత, దుర్గాసాయి టిఫిన్ సెంటర్, మార్కెట్ ఏరియా

ఆయిల్ అంటుకోదు..



నేను బయట అల్పాహారం చేయాలనుకుంటే బత్తుల నర్సయ్య హోటల్‌లో నలభై ఏళ్లుగా పూరీ తింటాను. ఎంతో రుచిగా ఉంటుంది. పూరీని ముట్టుకుంటే ఆయిల్ అంటకుండా తయారు చేస్తారు. ఉదయం 10 గంట తర్వాత ఇచ్చే రెండో కర్రీ (బేసిన్)ను చాలామంది అభిమానిస్తారు. గురువారం ఇచ్చే ఉల్లిగడ్డల కర్రీతో పూరి తింటే ఆ టేస్టే వేరు.

– అనసూరి రామకృష్ణ, సిరిసిల్ల

చల్ల, నిమ్మకాయ స్పెషల్



ఎనగంటి జగదీష్ హోటల్‌లో ఆరేళ్లుగా పూరి తింటున్నా. వేడివేడిగా చేసిస్తారు. ప్రతి రోజూ ఒక కర్రీతో పూరీ అందిస్తారు. ఎంతో టేస్టీగా ఉంటోంది. ఇంట్లో వాళ్లకి పార్శిల్ కూడా తీసుకెళ్తా. పూరీ కర్రీతో పాటు నిమ్మకాయ, చల్ల ఇవ్వడం ఇక్కడ ప్రత్యేకత. బయట ఎన్ని హోటల్స్ ఉన్నా పట్టణంలోని రెండు పూరీ సెంటర్లకే జనాధరణ ఎక్కువ.

– గాజుల శ్రీనివాస్, సిరిసిల్ల

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చీర్లవంచలో మండలస్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈనెల 20న సీఎం రేవంత్ రెడ్డి వేములవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. చీర్లవంచలో బెడ బుడగ జంగల వారికి శ్మశాన వాటికకు ఎకరా స్థలం కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురుకి మంజూరైన రూ.13 లక్షల విలువైన 41 సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. ఇక్కడ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్ తదితరులు ఉన్నారు.





ఘనంగా జాతర

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం జాతర నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు జాతరకు తరలివచ్చారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు స్వామి వారు రథం పై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. జాతర ఆటవస్తువులు, తినుబండారాల దుకాణాలు ఏర్పాటు చేశారు. జాయింట్‌వీల్‌లో ఎక్కేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

‘పది’ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్ష ఫీజు తేదీ గడువును పొడిగించినట్లు రాష్ట్ర విద్యాశాఖ పరీక్షల బోర్డు శనివారం తెలిపింది. ఈనెల 18 వరకు అపరాధ రుసుంలేకుండా ఫీజు చెల్లించాల్సి ఉండగా ఈనెల 28వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- హైదరాబాద్‌లో ప్రమాదం
- మానాలలో విషాదం



వంశీ(ఫైల్)

రుద్రంగి: హైదరాబాద్‌లోని సుల్తాన్ బజార్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం మానాల గ్రామంలో విషాదాన్ని నింపింది. రుద్రంగి మండలం మానాలకు చెందిన చంద వంశీ(20) శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మానాల గ్రామస్తులు తెలిపిన వివరాలు. రుద్రంగి మండల మానాల గ్రామానికి చెందిన చంద రాజేశం, మానస దంపతుల కుమారుడు చంద వంశీ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. వంశీ మృతితో మానాల గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడు వంశీకి తండ్రి రాజేశం, తల్లి మానస, చెల్లె వెన్నెల ఉన్నారు.

● పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆర్‌వీ రాధాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే శిక్షణకోసం ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హతల జిరాక్స్‌కాపీలతో ఈనెల 30లోపు తెలంగాణ దరఖాస్తు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 040-23236112 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

● ఉద్రిక్తల మధ్య లడ్డూ వేలం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి స్వామి వారి లడ్డూల వేలం నిర్వహించారు. వేలం పాట మొదలుకాగానే సందుపట్ల రవి మైకు అందుకొని గతేడాది లడ్డూను దక్కించుకున్న వ్యక్తి డబ్బులు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. ఏడాదిగా ఆలయ కమిటీ ఏం చేస్తుందని నిలదీయగా.. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ పాత కమిటీ అధ్యక్షుడు నంది కిషన్ అడ్డుపడ్డాడన్నారు. దీంతో అక్కడే ఉన్న నంది కిషన్ వేదికపైకి ఎక్కి ఇప్పటికే మూడు సార్లు జరిగిన మీటింగ్‌లో ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. మాటమాట పెరగడంతో అక్కడే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కల్పించుకొని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అనంతరం లడ్డూ వేలంపేట సాఫీగా సాగింది.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు క్రీడాపోటీలు

సిరిసిల్లకల్చరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద క్రీడాపోటీలు నిర్వహించారు. అండర్-12 విభాగంలో బాలబాలికలకు ట్రాక్ అండ్ ఫీల్డ్ రన్నింగ్, లాంగ్‌జంప్, జావలిన్ త్రో పోటీలు జరిగాయి. పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులు డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. పీఈటీలు రాజు, విజయ్ శ్రీనివాస్, వినోద్‌కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

● పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

వేములవాడఅర్బన్: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆది,సోమవారం జరిగే గ్రూప్ 3 పరీక్షల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (143 సెక్షన్) అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్లు, లౌడ్ స్పీకర్లు పరీక్షలు ముగిసేవరకు మూసి వేయాలన్నారు.

● యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌కు రిమాండ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన ఓ యూట్యూబ్ చానల్ రిపోర్టర్ బెస్త నరేశ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ భవానిని యూట్యూబ్ చానల్ రిపోర్టర్ నరేశ్ డబ్బులు, కోడిగుడ్లు డిమాండ్ చేయడంతోపాటు ఉద్యోగం తీపిస్తానని బెదిరింపులకు పాల్పడ్డట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. అరెస్ట్ చేసి జడ్జి ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

● సభను విజయవంతం చేయాలి

గంభీరావుపేట: మాలల ఐక్యతను చాటేందుకు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన మహా పాదయాత్ర ఈనెల19న జిల్లాలోకి వస్తోందని, మాల మహానాడు నాయకులు పాదయాత్రలో భాగస్వాములు కావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ మండల అధ్యక్షులు గన్నె నాగరాజు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో మాల మహానాడు నాయకులు విలేకరులతో మాట్లాడారు. జిల్లా బాధ్యులు మల్యాల రాజవీర్, ఎడబోయిన రాజు, స్వామి, బండ రమేశ్, నాయకులు బాలయ్య, ఉపేంద్ర, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

● విజ్ఞాన ప్రదర్శన

ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని కేరళ మోడల్ పాఠశాలలో ప్రపంచ సైన్స్ డే సందర్భంగా విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఇల్లంతకుంట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మహేష్ చంద్ర, ఆదర్శ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు గూడెల్లి అంజన్న వ్యవహరించారు.

● వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్రవాహనాలకు జరిమానా విధించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు.



ముస్తాబాద్: ముస్తాబాద్ మండల పరిషత్ రహదారి ఎదుటే రోడ్డుపక్కన చెత్తను వేస్తున్నారు. రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. మండల పరిషత్ రహదారిలోనే ఇలా చెత్త కుప్ప ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా చెత్తను తరలించాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
రమేశ్, పంచాయతీ కార్యదర్శి, ముస్తాబాద్. ఫోన్ నెంబర్ 9866964956

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మహాసభల కరపత్రం ఆవిష్కరణ



కోనరావుపేట: సుద్దాలలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కోనరావుపేట: సిరిసిల్లలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. కోనరావుపేట మండలం సుద్దాలలో సీపీఎం పార్టీ జిల్లా మూడో మహాసభల సందర్భంగా హమాలీ కార్మికులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. మాసం సురేష్, ఎగదండి లక్ష్మణ్, ఎరవెల్లి శంకర్, ఎర్రవెల్లి రవి, మాసం దాస్, కాదాసు సుధాకర్, రాజు, పూర్ణ, ఎర్రవెల్లి మహేశ్, కాయితీ కరుణాకర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్లలో ఈనెల 19, 20వ తేదీల్లో ఏర్పాటు చేసిన సీపీఎం 3వ మహాజభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, వీరేశం కోరారు. మండలకేంద్రంలో శనివారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 19న వేలాది మందితో భారీ ప్రదర్శన, 20న 200మంది ప్రతినిధులు మహాసభకు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, కష్టజీవులు పెద్దఎత్తున తరలివచ్చి సభలను జయప్రదం చేయాలన్నారు. నాయకులు నక్క దేవరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరాల జల్లు కురిపించేనా!

- నాడు ప్రతిపక్ష నేతగా...
- నేడు ముఖ్యమంత్రి హోదాలో..
- ఈనెల 20న వేములవాడ రాజన్న దర్శనానికి సీఎం రేవంత్‌రెడ్డి



వేములవాడ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారిగా రేవంత్‌రెడ్డి వేములవాడ రాజన్న దర్శనానికి ఈనెల 20న రానున్నారు. సీఎం రాకతో రాజన్న ఆలయానికి, పట్టణాభివృద్ధికి ఆయన వరాల జల్లు కురిపిస్తారని ఈ ప్రాంత భక్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 2023 మార్చి 6న అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన రేవంత్‌రెడ్డి వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి వేములవాడకు వస్తున్న రేవంత్‌రెడ్డి రాజన్న ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి వరాల జల్లు కురిపిస్తారని భక్తులు ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగా సీఎం రేవంత్‌రెడ్డిని వేములవాడకు తీసుకువచ్చి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎన్నోసార్లు చెబుతున్నారు. చెప్పినట్లుగానే సీఎం రాజన్న ఆలయానికి వస్తుండటంతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆలయ, పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రితో హామీల జల్లు కురిపించడమే కాకుండా నిధుల మంజూరు చేసేందుకు హామీ ఇవ్వనున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

గతంలో మోదీ వచ్చినా..

గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2024, మే 8న వేములవాడకు వచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని వెళ్లారు. రాజన్న ఆలయానికి ప్రధాని మోదీ కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తారని ఈ ప్రాంతవాసులు అనుకున్నారు. కానీ ఎన్నికల సమయంలో కోడ్ నిబంధనతో ఎలాంటి హామీలు ఇవ్వలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఆలయానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తుండటంతో ఈ పట్టణ అభివృద్ధికి ఏమైనా హామీలు ఇస్తారనే ఆశగా ఈ ప్రాంతవాసులు ఎదురుచూస్తున్నారు.

పురుగుమందుల విక్రయాలపై నిఘా ఉంచాలి



బోయినపల్లి: ఫెర్టిలైజర్ దుకాణ నిర్వాహకులతో సమావేశమైన ఎస్సై, ఎంఏవో

వేములవాడఅర్బన్: ఫెర్టిలైజర్ నిర్వాహకులు పురుగుమందుల విక్రయాలపై నిఘా పెట్టాలని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతులకు కాకుండా ఇతరులకు ధ్రువీకరణ పత్రాలు లేకుండా పురుగుమందులు విక్రయించవద్దన్నారు. అనధికారికంగా ఎవరైనా విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సైలు రమేశ్, అంజయ్య, దుకాణాల యజమానులు ఉన్నారు.

బోయినపల్లి: వ్యవసాయ రైతులకు మాత్రమే పురుగు మందులు విక్రయించాలని ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ పేర్కొన్నారు. ఎంఏవో కే.ప్రణీతతో కలిసి రైతువేదిక భవనంలో మండల ఎరువులు, పురుగు మందులషాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ వ్యవసాయం చేయనివారికి, మండలపరిధి కాని వారికి పురుగు మందులు విక్రయించవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలుగ్రామాల ఎరువులు, పురుగుల మందుల దుకాణదారులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎల్లయ్య గౌడ్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని అన్ని గ్రామాల విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి డీలర్ షాపులో స్టాక్ రిజిస్టర్ ఉండాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, క్రిమి సంహారక మందులు అందించాలని విత్తన డీలర్లను కోరారు. సమావేశంలో డీలర్లు శ్రీనివాస్, రమేశ్, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, మైపాల్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.